క్లుప్తంగా

ప్రక్కిలంకలో సౌరయాగం పూజలు ప్రారంభం

తాళ్లపూడి: ప్రక్కిలంక శివాలయం వద్ద లోకకల్యాణార్థం శశిశేఖర మిత్రబృందం ఆధ్వర్యంలో 16వ సౌరయాగం పూజలు గురువారం ప్రారంభించారు. అర్చకుడు కొతవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మహాగణపతి పూజ, సర్వదేవతా ఆరాధన, గోపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, సౌరజపం, సూర్యనమస్కారాలు, సౌర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథశర్మ మాట్లాడుతూ మాఘమాసం నెల రోజులపాటు ఈ పూజలు చేయాలన్నా ఆయన తెలిపారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: పట్టణంలో శ్రీనివాసపురంలో గోదావరి ఒడ్డున నిర్మించి ప్రకృతి రావణ బ్రహ్మ సూత్ర మల్లన్న క్షేత్రంలో గురువారం మహా సౌర యాగం ప్రారంభించారు. ఈ యాగం 14 రోజులు పాటు కొనసాగనుంది. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని,నాయకులు సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్ తదితరులతో భక్తులు పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

నల్లజర్ల: మాదిగ సంఘాల జాతీయ సమావేశం వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహించనున్నట్టు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను గురువారం నల్లజర్లలో ఆయన ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మర్రి శోభన్ బాబు, తాడిగడప సిద్ధూ, కూనపాం మాస్, జొన్నకూటి శేఖర్, పెదపాటి మనోహర్, కంకిపాటి సువర్ణరాజు, పెనుమాక వెంకట్రావు, పండు పాల్గొన్నారు.

కల్వర్టు ఢీకొని యువకుడికి గాయాలు

గోపాలపురం: కల్వర్టును ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కె సురేష్ గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం అత్తగారింటికి వస్తుండగా గ్రామ శివార్లలో ఉన్న కల్వర్టును ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలైయ్యాయి. కల్వర్టు ఎత్తుపెంచడం, ఇరువైపులా గోతులు ఉండడంతో అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రగాయాలైన సురేష్‌ను గోపాలపురం ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత

కొవ్వూరు: పెద్దేవం గ్రామానికి చెందిన ఇంటి సత్యనారాయణకి వైద్య ఖర్చులు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.30,032 చెక్కులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం అందజేశారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళితో గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు

నిడదవోలు రూరల్: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినట్టు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. సమిశ్రగూడెంలో వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. ఎన్నికల నియమావళికి రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నిడదవోలు : పట్టణంలో కుమ్మరివీధిలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.11.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మున్సిపల్ పార్కు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, గంగుల గోపియాదవ్, మున్సిపల్ ఏఈ హేయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

దేవరపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025లో భాగంగా స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వి.సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నంబరు ప్లేట్ లేకుండా నడపడం చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. వాహనాలను అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధికి అందుబాటులో వైద్యం

ఉండ్రాజవరం: కుష్ఠు వ్యాధికి సరైనా వైద్యం అందుబాటులో ఉందని వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్ అన్నారు. మండలంలో సూర్యారావుపాలెంలో గురువారం కుష్ఠు వ్యాధిపై గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది కె.సుభాషిణి, జి.కల్యాణి, ఎస్.పద్మావతి, సీహెచ్ దుర్గామల్లేశ్వరి, 104 డీఈవో శ్రవణ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియం.. లాభదాయకం

- ఆశాజనకంగా ప్రకృతి వ్యవసాయం
- విస్తరిస్తున్న సాగు
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- గోపాలపురం నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో సాగు



శింగరాజుపాలెంలో సాగు చేస్తున్న వరి చేనులో దుబ్బుల పరిశీలన



కూరగాయల పాదులకు ఘన జీవామృతం వేస్తున్న కూలీలు



పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు, ఆవుమూత్రంతో అగ్నిఅస్త్రం తయారు చేస్తున్న మహిళలు

నల్లజర్ల: రసాయనాలు, క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగించడంతో పంటలు పూర్తి కాలుష్యం బారిన పడుతున్నాయి. దీనివల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి. క్రమంగా వీటిని అరికట్టి ప్రకృతి వ్యవసాయన్ని విస్తరిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పంటలు పండించడం వల్ల అటు భూమికి, ఇటు ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సాగు ఆశాజనకంగా ఉంది. గోపాలపురం నియోజకవర్గంలో 5వేల ఎకరాలలో 6,500 మంది రైతులు ఈ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రారంభించారు. కూరగాయల సాగుతో పాటు వరి, ఆయిల్ ఫామ్, నిమ్మ, మొక్కజొన్న, కోకో వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈఏడాది వర్జీనియా సాగు జరుగుతోంది. నల్లజర్ల మండలంలో శింగరాజుపాలెం, మారెళ్ళమూడి, ముసుళ్ళగుంట, పుల్లలపాడు, నల్లజర్ల గ్రామాలలో ఈ ఏడాది ఈ తరహా వ్యవసాయం ప్రారంభించారు.

ప్రయోగాత్మకంగా..

ప్రకృతి వ్యవసాయంలో వరి, కూరగాయల సాగు, ఆయిల్‌ఫామ్, నిమ్మ, మొక్కజొన్నలలో ప్రయోగాత్మకంగా 400 మంది రైతులు 200 ఎకరాలలో సాగు ప్రారంభించారు. ఒక మాస్టర్ ట్రెనీని నియమించారు. ఇలా జిల్లాలో అన్ని మండలాల్లో సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్య వంతుల్ని చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని మాస్టర్ ట్రెనర్ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్దగా నష్టం ఉండదంటూ ప్రకృతి పరంగా సాగయ్యే పంటకు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి ఉంటుందని చెబుతున్నారు. చీడపీడలు దరి చేరవు. నాణ్యమైన ఉత్పత్తుల వల్ల చక్కని ఆరోగ్యం మన సొంతమవుతుంది. పండించే పంటలకు మంచి డిమాండ్ ఉంది. సాగులో బీజామృతం, జీవామృతం, బ్రహ్మాస్త్రం, ఆచ్ఛాదన తదితర ప్రకృతి సాగుకు సంబంధించిన అంశాలపై, కషాయాలు తయారీపై శ్రీనివాసరావు వివరిస్తున్నారు. వరిలో అజొల్లా పెంచడం ద్వారా కలుపు నివారణతో పాటు చేనుకు బలం కూడా ఉంటుందన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించేందుకు అవసరమైన సూచనలు చేయడంతో పాటు వాటిని స్వయంగా పర్యవేక్షించి వాటి ఫలితాలు రైతులకు చూపుతున్నామన్నారు. వరినాట్లకు వరుసగా మూడేళ్లపాటు నవధాన్యాలు వేయడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చునన్నారు.

జీవామృతం తయారీ..

పొలాల్లో పురుగుమందుల వినియోగం లేకుండా సహజ పద్ధతిలో పంటలను పండించడానికి ఆవుపేడ, ఆవు మూత్రం, బెల్లం, వేపాకు, సీతాఫలం ఆకు తదితర వాటితో కషాయాలు తయారు చేసి సాగులో వినియోగించేలా చేస్తున్నామన్నారు. తద్వారా సారం కోల్పోయిన భూమి తిరిగి మూడేళ్లలో సారవంతమవుతందన్నారు. భూమి స్థితి మారి దిగుబడులు పెరుగుతాయన్నారు. రైతులకు ఎరువులు, పురుగుల మందుల పెట్టుబడి లేకుండా ఉంటుందన్నారు.

రైతుల ఆసక్తి



ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. దేశీయ ఆవు విసర్జితాల నుంచి తయారు చేసిన జీవామృతం భూసారాన్ని పెంచుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతుంది. సహజంగా పండించిన పంటలకు మార్కెట్లో మంచి ధరలు లభిస్తోంది. ఘన, జీవ, ద్రవ జీవామృతాలు వినియోగించడం వల్ల ఎరువుల అవసరం లేకుండా పోతుంది. మొక్కలు ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇస్తాయి. వానపాములు, సూక్ష్మజీవులు మేల్కొని పంటలకు మేలు చేస్తాయి. – శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం, నల్లజర్ల

ఆరోగ్యకర దిగుబడి



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10వేలు ఖర్చు చేసి రసాయనిక ఎరువులు కొని చేసే వ్యవసాయంలో రూ. వెయ్యి రుపాయలతో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడి కూడా లభిస్తోంది. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం ద్వారా ఆరోగ్యం కూడా బాగా ఉంటుంది. – మారెం కనకదుర్గ, మహిళా రైతు, సింగరాజుపాలెం

వేంకటేశ్వరుని ఆలయాన్ని పరిశీలించిన అధికారులు



స్వామివారి ఆలయం పునర్నిర్మాణం నిమిత్తం అంచనాలు వేయడానికి వచ్చిన ఇంజనీరింగ్ అధికారులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి కొరకు దేవదాయ ధర్మదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీంగ్ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆలయం పునర్నిర్మాణానికి దేవస్థానం నుంచి ఆదేశాలు వచ్చాయని, పనులకు అంచనాల వేయడానికి వచ్చామని తెలిపారు. ఈ ఆలయం రోడ్డు కంటే 5 అడుగుల లోతులో ఉందని దీని వలన వర్షాకాలంలో నీరు అంతా ఆలయంలోకి ప్రవేశిస్తుందని ఇక్కడ అధికారులు నివేదికలు ఇచ్చారని, దీంతో ఆలయాన్ని పూర్తిగా పరిశీలించి పూర్తి అంచనాలు తయారు చేయనున్నామన్నామని తెలిపారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ గత కొన్నేళ్లగా ఆలయం కూడ శిథిల వ్యవస్థకు చేరిందని, జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ రోడ్డు కంటే ఆలయం పల్లంగా ఉందని ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి జగన్, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు కల్పించాలి



రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా ఎంపికైన నిడదవోలు రైల్వేస్టేషన్‌లో జన్మభూమి, ఎల్‌టీటీ కాకినాడ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. కోవిడ్ సమయంలో రద్దు చేసిన నిడదవోలు–భీమవరం, నరసాపురం ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న నిడదవోలు రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు కల్పిస్తే హైదరాబాద్, ముంబై, అహ్మదాబాద్ ప్రాంతాలకు పగటి పూట ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి హాల్టు కల్పించాలని కోరారు. ఎస్.సుందరబాబు, గంటి కృష్ణ, ఉస్మాన్, యర్రా శ్రీను, ఎస్.రాజేష్, ఈ.సతీష్, టి.నాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ‘మానుకొండ’



మానుకొండ చంద్రబాబు



కంతమణి రమేష్‌బాబు



సాలి వేణు

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామానికి చెందిన మానుకొండ చంద్రబాబును వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రెండోసారి పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేసిన చంద్రబాబును 2023 ఫిబ్రవరిలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీపీ తిరుమళ్ల భాగ్య లక్ష్మి, పార్టీశ్రేణులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా రమేష్‌బాబు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణానికి చెందిన 22వ వార్డు కౌన్సిలర్ కంతమణి రమేష్‌బాబు నియమితులు కావడంపై హర్షతీరేకాలు వ్యక్త మవుతున్నాయి. ఆయన గతంలో కొవ్వూరు నియోజకవర్గానికి యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. 2018 మే 15న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఈయన వైఎస్సార్ సీపీ చేరారు. అప్పటి నుంచి పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. యువ నాయకుడిగా రమేష్‌బాబు పార్టీ చేస్తున్న సేవలకు గుర్తింపు ఈ పదవి లభించింది. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి కేటాయించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడిగా వేణు

గోపాలపురం: తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ డైరెక్టర్ సాలి వేణును పార్టీ కేంద్ర కార్యాలయం నియమించినట్టు సాలి వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందనడాకి తానే నిదర్శనమన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతాయుతమైన జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ హోం మంత్రి తానేటి వనిత, జిల్లా అధ్యక్షుడు చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణకు సాలి వేణు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేశ్వరరావుకు సత్కారం

పెరవలి: విధి నిర్వహణలో ఎంతో కచ్చితత్వంతో పనిచేసి, ప్రజలకు అందుబాటులో ఉండడం, పలు సేవా కార్యక్రమాలు చేయటం వలనే జిల్లాలలో ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకోగలిగారని ప్రముఖ కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొంపెల్ల పట్టాభిరామయ్య అన్నారు. ముక్కామల గ్రంథపాలకుడు యం వెంకటేశ్వరరావుని గ్రామ ప్రముఖులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అబివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సాయిరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా కన్నా గ్రామస్తుడనే భావన కల్పించారని, సమాజ సేవలో తన వంతు సహకారం అందించారన్నారు. సలాది సూర్యనారాయణ, మద్దిపాటి సత్యం, కె.విశ్వనాథం, ఎం.శ్రీరామమూర్తి పాఠకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

కొవ్వూరు: నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధికి బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ముత్తూట్ ఫిన్ కార్ప్, మెడ్ ప్లస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకి 63 మంది హాజరుకాగా వీరిలో 21మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమశ్‌రావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరప నేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి

నల్లజర్ల: మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాజు భద్రయ్య అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు భద్రయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు చూపిన బాటలోనే ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. దేశానికే కాకుండా అంతర్జాతీయ సమాజానికి మార్గదర్శకులుగా నిలిచిన దార్శనికుడని కొనియాడారు. కార్యక్రమంలో అనంతపల్లి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిక్కాల నాగేశ్వరావు, గౌరవాధ్యక్షుడు వంకాయల వరకుమార్, వల్లాల నాగబాబు, ఉద్దగిరి శ్రీనివాస్, సాలస రామరాజు, ఉద్దగిరి నాగేశ్వరావు మాష్టారు, సమయమంతుల కాశీ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.రామకృష్ణ, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, వీఆర్వో ప్రకాష్, లీలావతి, ఇబ్రహీం, వీఆర్ఏ సురేష్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సింహద్రి జనార్దన రావు, యండపల్లి శేఖర్, జగదీష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడి బస్టాండ్ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి దుస్తులు పెట్టి..

నల్లజర్ల: మహాత్ముని అడుగు జాడలలో ప్రతి ఒక్కరూ నడవాలని రిటైర్డు ట్రెజరీ ఆఫీసర్, ప్రముఖ గాంధేయవాది దొడ్డిగర్ల గంగాధరరావు అన్నారు. తూర్పుచోడవరం జడ్పీ హైస్కూలు, స్పెషల్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామపంచాయతీలో పని చేస్తున్న 8 మంది పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి వారికి నూతన బట్టలు అందజేశారు. మూడు పాఠశాలల్లో ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో అల్లాడ రామకృష్ణ, ఉండవల్లి గోపి, పెండ్యాలచందు, ఉప్ప నరేష్ పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం గోపాలపురం ఆర్యవైశ్యలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మద్దు రామభాస్కరరావు, సుతాపల్లి రామకృష్ణ, మద్దు జగన్‌మోహన్‌రావు, శివరామకృష్ణ, గుబ్బా లక్ష్మణరావు, శ్రీనివాస్,కొల్లూరి సత్రయ్య, ఆర్యవైశులు పాల్గొన్నారు.



తూర్పుచోడవరంలో పారిశుధ్య కార్మికులకు కాళ్లు కడిగి దుస్తులతో సత్కరిస్తున్న రిటైర్డు ట్రెజరీ ఆఫీసర్ గంగాధరావు

గాంధీజీ నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

కొవ్వూరు: పట్టణంలో టీడీపీ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి,మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: గాంధీజీ ఆశయాలను యవత ఆదర్శంగా తీసుకోని,ప్రతి ఒక్కరు ఆచరించాలని రాష్ట్ర సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. మల్లవరంలో ఆనందనికేతన్ సేవా కేంద్రంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ఆశ్రమం ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, బీజేపీ నాయకులు కరుటూరి జగన్, ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు, గాంధేయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీజీకి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

నిడదవోలులో..

నిడదవోలు: మహనీయుల త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాల ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అహ్మద్ ఫయాజ్ అన్సారీ అన్నా రు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గాంధీజీ విగ్రహానికి వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యు లు రవికాంత్, సూర్య ప్రసాద్, అస్మత్, రెహ నా జానకిప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని దేవరపల్లిలో ఆర్యవైశ్యులు గురువారం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గల గాంధీ విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కొత్తగుండ రత్నాజీ, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ గవర్నర్ శ్రీకాకొళపు కాశీకృష్ణ, యువజన సంఘం అధ్యక్షులు సుతాపల్లి వెంకటరామారావు, నాయకులు తీగెల బలరామయ్య, పలువురు ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సర్వే రోవర్‌తో రైల్వే భూముల సర్వే

ఉండ్రాజవరం: సర్వే రోవర్ సహాయంతో రైల్వే భూములు సర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. రీ సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలో పైలట్ గ్రామమైన సత్యవాడ గ్రామంలో గురువారం ప్రభుత్వ భూముల సర్వేలో భాగంగా రైల్వే భూములు సర్వే చేశారు. తహసీల్దార్ ప్రసాద్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సీహెచ్ గురుకృష్ణ ఆధ్వర్యంలో రీసర్వే డీటీ ఎం.హరిప్రసాద్, వీఆర్వో జె.లక్ష్మినరసమ్మ, గ్రామ సర్వేయర్ మారుతి శ్రీరామ్, గ్రామ సర్వే బృందం సర్వే నిర్వహించారు.



కొవ్వూరులో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



మల్లవరంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గాంధేయవాదులు



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు